
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 సిద్దిపేట

శుక్రవారం 25 అక్టోబరు 2024



విలీనంపై వివాదం



తెరమీదకు జిల్లాలు, జోన్ల మార్పు అంశం

- చార్మినార్ జోన్‌లో కలపాలని సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో డిమాండ్
- ఉద్యోగాలు, పదోన్నతుల ఆలస్యంపై అభ్యంతరాలు
- కరీంనగర్‌వైపే హుస్నాబాద్ ప్రజల చూపు
- మెదక్ కన్నా సంగారెడ్డినే మిన్నగా మూడు మండలాలు
- మార్పులు, చేర్పులపై మళ్లీ ఉత్కంఠ



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, అక్టోబరు 24 : ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటైన జిల్లాలు, మూడేళ్ల కిందట విభజించిన జోన్లపై తాజాగా వివాదం మొదలైంది. జిల్లాలు, జోన్ల విషయంలో మార్పులు, చేర్పులు చేపట్టాలనే డిమాండ్ తెరమీదకొచ్చింది. ఒకప్పుడు హైదరాబాద్‌కు అనుసంధానమైన జోన్‌లో ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాను మూడు జిల్లాలుగా విభజించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో శాస్త్రీయంగానే మండలాలను అటు ఇటుగా మార్చినప్పటికీ కొన్ని మండలాల విషయంలో నాటి నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు కొత్త జోన్‌పై సిద్దిపేట, మెదక్ జిల్లాల ఉద్యోగులు, నిరుద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున జిల్లాలు, జోన్ల మార్పు అంశాన్ని పరిశీలించాలనే విన్నపాలు వ్యక్తమవుతున్నాయి.

చార్మినార్ జోన్‌లో కలపాలని

ఉమ్మడి మెదక్ జిల్లాను సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలుగా విభజించారు. అయితే సంగారెడ్డి జిల్లాను మల్టీజోన్-2లోని చార్మినార్ జోన్‌లో విలీనం చేయగా.. సిద్దిపేట, మెదక్ జిల్లాలను మాత్రం మల్టీజోన్-1లోని రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు ఉంటే ఉద్యోగ అవకాశాలతోపాటు ప్రమోషన్లు త్వరగా దక్కుతాయని ప్రస్తుతం సిద్దిపేట, మెదక్ జిల్లాల నిరుద్యోగులు, ఉద్యోగులు భావిస్తున్నారు. చార్మినార్ జోన్‌లో ఉన్న సంగారెడ్డితోపాటే ఈ రెండు జిల్లాలను కూడా విలీనం చేయాలనే డిమాండ్ ఎక్కువైంది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సిద్దిపేట, మెదక్‌ను ఎక్కడో ఉన్న ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాలతో ముడిపెట్టారని అభ్యంతరం తెలుపుతున్నారు. ఇక రాజన్న సిరిసిల్ల జోన్‌లోని కరీంనగర్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాలతో సిద్దిపేట, మెదక్‌కు పొంతన లేదని అంటున్నారు. ఈ రెండు జిల్లాల ప్రజలు, ఉద్యోగులు అధిక శాతం హైదరాబాద్‌తోనే సన్నిహిత సంబంధాలు, భవిష్యత్తులో స్థిర నివాస

తరువాయి 7వ పేజీలో



ఎమ్మెస్సీ ఫిషరీస్ విభాగం మ్యూజియంలో భద్రపరిచిన వివిధ రకాల చేపల నమూనాలు

చేపల ప్రయోగశాల

సిద్దిపేటలో రాష్ట్రంలోనే మొదటి పీజీ కోర్సు

- అందుబాటులో ఎమ్మెస్సీ ఫిషరీస్
- పరిశోధనతో పాటు ఉపాధి మార్గాలు
- చేపల కొలను, ప్రత్యేక మ్యూజియం
- ఆక్వా క్లినిక్స్ ద్వారా ఫీడ్, సీడ్

7

రాష్ట్రంలో ఫిషరీస్‌లో పీజీ స్థాయి కోర్సు సిద్దిపేటలో ఉండడం విశేషం. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుబంధ పీజీ కాలేజ్‌లో ఎమ్మెస్సీ ఫిషరీస్ అందుబాటులో ఉంది. లెక్చరర్ల ప్రోత్సాహంతో ఇక్కడి విద్యార్థులు మత్స్య సంపదను కాపాడేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తూ, సరికొత్త పరిశోధనలకు నాంది పలుకుతున్నారు. ఈ విభాగంలో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేసి సుమారు 400 రకాల చేపల నమూనాలను భద్రపరిచారు. ఇక్కడి ఆక్వా క్లినిక్‌లో చేప వ్యాధులకు మందులను అందించడమే కాకుండా, చేప విత్తనం సరఫరాతో పాటుగా వాటికి అవసరయ్యే ఆహారాన్ని ఇస్తున్నారు.

జూనియర్ విద్యార్థులతో సీనియర్లు ఫ్రెండ్లీగా మెదలాలి

- సిద్దిపేట ఏసీపీ మధు
- ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ నిషేధ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట టౌన్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): జూనియర్ విద్యార్థులతో, సీనియర్లు ఫ్రెండ్లీగా మెదలాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. గురువారం సిద్దిపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవలే ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సర విద్యార్థులు చేరిన నేపథ్యంలో ప్రిన్సిపల్ విమల థామస్ నేతృత్వంలో గురువారం వైద్య విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధ చట్టంపై ఏసీపీ మధు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు నిజమైన హీరోలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడడంతో పాటు ప్రోత్సహించడం, మద్దతుగా నిలవడం నేరంగా పరిగణించాల్సి ఉంటుందని తెలిపారు. ఉన్నతమైన భవిష్యత్తు కోసం ప్రణాళికతో కష్టపడాలన్నారు. ప్రతీ విద్యార్థికి చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని, కళాశాలకు, కుటుంబానికి మంచిపేరు తీసుకరావాలని సూచించారు. ప్రిన్సిపల్ విమలాథామస్ మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల చదువు, క్రమశిక్షణలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని, ఏదైనా సమస్యలుదైతే తన దృష్టికి, ర్యాగింగ్ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. వైద్య వృత్తి ఎంతో గొప్పనైందని, ఈ వృత్తిలోకి అడుగుపెట్టబోయేవారు ఉన్నతంగా ఆలోచించాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ర్యాగింగ్ నిషేధ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల క్రితం పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 8 మందిని పట్టుకొన్నారు. గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా విచారణ చేసి వారికి రూ.12,000 జరిమాన విధించారు.

రోడ్లపైనే కల్లాలు



అక్కన్నపేట మండలం కేశనాయక్ తండా రోడ్డుపై వరి ధాన్యం కుప్పలు

రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఆరబోయడానికి స్థలం లేక రహదారులను ఉపయోగించుకుంటున్నారు. వరి ధాన్యం, కంకులను సమీపంలోని రోడ్లపై వేసి కల్లాలుగా వాడుకుంటున్నారు. ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం కుప్పలు చేసి రాత్రిళ్లు అక్కడే ఉంచుతున్నారు. రాత్రివేళ కుప్పలను గమనించకపోతే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశమున్నది.

– అక్కన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)



మసిరెడ్డి తండాలో రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న

'పాలిటెక్నిక్' సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారిగారి ప్రీతమ్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రీతమ్

గజ్వేల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారిగారి ప్రీతమ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను గురువారం ఆయన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ గదులు, ప్రయోగశాల, విద్యార్థుల వసతి గృహాలు, డైనింగ్ హాల్, తరగతి గదులు, విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న భోజనం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఎడ్యుకేషన్ హబ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థి కాగా, గురువారం రాత్రి ఇక్కడే బస చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషక విలువలతో కూడిన భోజనం, చక్కటి వసతుల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించి శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలోనే ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ప్రీతమ్ తెలిపారు. కాగా కళాశాలకు సంబంధించిన వివిధ అంశాలను ప్రిన్సిపాల్ కృష్ణారావు ఆయనకు వివరించారు. ఆయన వెంట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు యాదగిరి, కన్నాయాదవ్, అరవింద్, నక్క రాములు, వహీద్, దయ్యాల యాదగిరి తదితరులున్నారు.

దళారుల దోపిడీ

- సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర
- చెల్లిస్తుంది రూ.1900లోపే
- కోత పూర్తవగానే వాలుతున్న దళారులు

కోహెడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : దళారుల దోపిడీ మొదలైంది. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు ధాన్యం కొనుగోళ్లలో నష్టం తప్పడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్ని చోట్లా ప్రారంభం కాకపోవడం, ప్రారంభించిన వాటిల్లో పలుచోట్ల కొనుగోళ్లు మొదలు కాకపోవడంతో దళారులు ఎంత చెబితే అంతకే అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో మిల్లర్లు రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం ఐకేపీ, సహకార సంఘాల ద్వారా కోహెడ మండలంలో 26 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మిగతా 14 కేంద్రాలు నేటికి ప్రారంభం కాలేదు. ఏర్పాటు చేసిన కేంద్రాల్లోను ధాన్యం కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో రైతులు దళారుల బాట పడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని మిల్లుల వద్ద అప్పుడే దోపిడీ మొదలైంది. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి రూ.2320 మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్‌ను ప్రకటించింది. మరో వైపు సాధారణ రకం ధాన్యానికి రూ.2300 మద్దతు ధర

తరువాయి 8వ పేజీలో

ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంకా ప్రారంభం కాలేదు



మాది మండలంలోని రామచంద్రాపూర్ గ్రామం . నేటికీ మాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదు. వరి పంట కోతలు ప్రారంభం అయ్యాయి. వర్షాలు పడే అవకాశం ఉన్నందున నేరుగా రైస్ మిల్లుకు అమ్ముకున్నాను.

– బొల్లుమల్ల రమేష్, రైతు, రామచంద్రాపూర్



కోహెడలో రహదారి పక్కనే తూకం వేస్తూ లారీలో తరలిస్తున్న ధాన్యం

సిద్దిపేట అభివృద్ధి సూపర్

- మున్సిపల్ చేపడుతున్న పనులు భేష్
- పట్టణంలో పర్యటించిన 11 మున్సిపాలిటీల కమిషనర్లు, సిబ్బంది
- ప్రగతి వివరాలు వెల్లడించిన చైర్‌పర్సన్, కమిషనర్



స్వచ్ఛ బడిలో పాఠాలు చెబుతున్న చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేట టౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో జరిగిన అభివృద్ధి సూపర్ అంటూ, ఇక్కడికి వచ్చి చాలా విషయాలు నేర్చుకున్నామని, రాబోయే రోజుల్లో ఆయా మున్సిపాటీల్లో అమలు చేస్తామంటూ రాష్ట్రంలోని 11 మున్సిపాలీటీలకు చెందిన కమిషనర్లు, అధికారులు, సిబ్బంది తెలిపారు. గురువారం పట్టణాన్ని జనగామ, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, నర్సంపేట, వర్ధన్నపేట, సిరిసిల్ల, ఆర్మూర్, భీంగల్, బోధన్‌లకు చెందిన కమిషనర్లు, అధికారులు సందర్శించారు. సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం, అధికారులు చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వారికి సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పనుల వివరాలను వివరించారు. చెత్తను తడి, పొడి, హానికర చెత్తను ఏవిధంగా వేరు చేస్తున్నారో అధికారుల బృందం పరిశీలించింది. పొడి, తడి చెత్త వేరు చేసే విధానాన్ని వార్డుల్లో పర్యటిస్తూ తెలుసుకున్నారు. విద్యావర్ధిని పాఠశాలలో విద్యార్థులతో, ఉపాధ్యాయులతో చెత్త వేరు చేయు విధానంపై మాట్లాడారు. తడి చెత్తను సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో బుస్సాపూర్‌లో ఏర్పాటు చేసిన గృహ వ్యర్థాల నుంచి సీఎన్‌జీ ఉత్పత్తి చేసే బయోగ్యాస్ ప్లాంట్‌ను, బయోమైనింగ్ ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించారు. హౌసింగ్ బోర్డు వద్దనున్న పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని (డీఆర్‌సీసీ)ను సందర్శించారు. స్వచ్ఛబడిలో వ్యర్థాలతో రూపొందించిన ప్లాస్టిక్‌తో తయారైన ఇటుక, టైల్స్‌ను పరిశీలించారు. అధికారులకు జ్ఞాపికగా అగర్‌బత్తి (కొబ్బరి పీచుతో తయారయ్యాయి), స్టీల్ వాటర్ బాటల్, సేంద్రియ ఎరువు, కలమును అందించారు.



నేలమట్టమైనా చెదరని జ్ఞాపకం

- అమరవీరుల స్తూపం ఆవిష్కరణ జరిగి నేటికి 34 ఏళ్లు..
- 2000లో గ్రీన్‌టైగర్స్ పేరుతో డిటోనేటర్లు పెట్టి స్తూపం ధ్వంసం
- పీపుల్స్ వార్ చరిత్రను గుర్తు చేస్తున్న శిథిలాలు

7

మహిళాసాధికారతకు డీడీఎస్ కృషి

7

- డీడీఎస్ చైర్మన్, ప్రొఫెసర్ బీపీ సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఎస్ సభ్యురాలు

చిరిగిన గన్నీ సంచులతో ఇక్కట్లు

- పనికిరాని 18 వేల సంచులు

8

ఆలయాల్లో చోరీ నిందితుల అరెస్టు

- ఆరు కేసులను ఛేదించిన గజ్వేల్ పోలీసులు
- రెండు బైకులు, బంగారం, వెండి, రాతి విగ్రహాలు స్వాధీనం

7



మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్న నాటు కోళ్లు

8

అతివలకు ఆర్థిక చేయూత

- సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు నాటు కోళ్ల పంపిణీ

సెంట్రల్ జైలును సందర్శించిన సంగారెడ్డి జిల్లా జడ్జి

కంది, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కందిలోని సెంట్రల్ జైలును సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర బుధవారం సందర్శించారు. జైలు మొత్తం కలియతిరిగి పరిశీలించారు. సదుపాయాలు, భోజనం గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. సమయానికి ములాకత్‌లు అందుతున్నాయా.. లేదా అని ఆరాతీశారు. జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ కూడా పరిశీలించారు. న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

కరెంటు కాటుకు యువరైతు బలి



నాగరాజు(ఫైల్)

రామాయంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కరెంటు కాటుకు యువరైతు బలైన ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ లో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన చాకలి నాగరాజు (37) గురువారం ఉదయం పంట పొలానికి నీళ్ల పెట్టేందుకు బోర్ స్టార్టర్ ఆన్ చేయబోయాడు. అప్పటికే అక్కడ ఫ్యూజ్ వైర్లు తెగిపడిన విషయాన్ని గమనించక పోవడంతో షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. చుట్టు పక్కల రైతుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబీకులు పొలం వద్దకు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. అందరితో కలుపుగోలుగా ఉండే నాగరాజు మృతి పట్ల గ్రామస్తులు సైతం కన్నీళ్ల పెట్టుకున్నారు. మృతునికి భార్య లత తో పాటు పన్నెండేళ్ల లోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న వాహనం.. వృద్ధుడి మృతి

అల్లాదుర్గం, అక్టోబరు 24.(ఆంధ్రజ్యోతి) : ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వృద్ధుడు మృతి చెందగా.. ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని సీతానగర్ గ్రామానికి చెందిన చిన్నోళ్ల వెంకయ్య (60) గురువారం పెద్దశంకరంపేటలో జరిగిన సంతకు వెళ్లి ఆటోలో తన నివాసానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీ కొట్టడంతో వెంకయ్య తలకు బలమైన గాయాలై అక్కడిక్కక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ నాగయ్యకు గాయాలుకాగా, జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



మహేందర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన వంగ మహేందర్‌రెడ్డి(56) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న మహేందర్‌రెడ్డికి కొండపాక మండలం విశ్వనాథపల్లి గ్రామరెవిన్యూ పరిధిలో నాలుగు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. పంటల సాగుకోసం ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని డీసీసీబీ కొండపాక పరిధిలో గతంలో పంటరుణం తీసుకున్నాడు. పంటలు సక్రమంగా పండకపోవడంతో రూ.2.02లక్షల వరకు అప్పులు పేరుకుపోయాయి. ప్రభుత్వం ఇటీవల పంటరుణమాఫీ చేపట్టడంతో బకాయి తీరుతుందని భావించాడు. కానీ రూ.2లక్షలకు పైగా బకాయి ఉండటంతో మాఫీకి నోచుకోలేదు. కుమారుడు హైదరాబాదులో ప్రైవేట్ జాబ్ చేస్తుండగా, మహేందర్‌రెడ్డి, భార్యతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం భార్యతో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా, వరికి పిచికారీ చేసేందుకు పురుగులమందు తీసుకువస్తానని చెప్పిన మోహన్‌రెడ్డి ఇంటివద్ద పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతోనే మోహన్‌రెడ్డి ఇబ్బందులపాలై ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయనది ప్రభుత్వ హత్యేనంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

మద్యం మానేయమన్నందుకు వ్యక్తి..

దుబ్బాక, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన పంజ శ్రీనివాస్ (54)కు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. వైద్యుల సూచన మేరకు మద్యం తాగవద్దని భార్య చెప్పినా వినడంలేదు. బుధవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చిన భర్తను భార్య రాజమణి నిలదీసి గొడవపడడంతో పురుగులమందు తాగాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

మెదక్ అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు గురవారం మెదక్ అవుట్ డోర్ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలకు మెదక్, సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన నలుగురు అరుణ్‌దినాకరణ్, శ్రీకాంత్, సౌదీ, జాన్‌పాల్‌లను ఎంపిక చేశారు. ఈ నెల 25 నుంచి 30 వరకు హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల కోసం వారు శిక్షణ శిబిరంలో పాల్గొంటారని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగారాజు తెలిపారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



అంతరించిపోతున్న చేపల జాతుల మీద పరిశోధన చేశాను. ఇందుకుగాను తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. ఈ గౌరవం దక్కడానికి నా అధ్యాపక బృందం అందించిన ప్రోత్సాహం చాలా ఉంది. ఈ కోర్సు వల్ల స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. ఆక్వా కల్చర్‌కు సంబంధించి రైతుల్లో అవగాహన కల్పించినట్లయితే మంచి ఫలితాలు వస్తాయి.

- బుక్యా సాయికుమార్, విద్యార్థి

ఆక్వా కల్చర్‌పై అవగాహన పెరగాలి



మాది జగిత్యాల జిల్లా. నేను డిగ్రీ, పీజీ కూడా ఇదే కాలేజీలో చదివాను. ఆంధ్రాలో ఎక్కువగా అవకాశాలు ఉంటాయి. అక్కడి మాదిరిగానే ఇక్కడ కూడా ఆక్వా కల్చర్‌పై అవగాహన పెంచాలి. ఆక్వా కల్చర్ చేయడానికి ఉపయోగపడే రీసెర్చ్ చేయడానికి కాలేజ్‌లో అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. అధ్యాపకుల సహకారంతో పరిశోధనలు చేస్తున్నాం.

- నవ్యశ్రీ, విద్యార్థిని

చేపల ప్రయోగశాల

సిద్దిపేటలో రాష్ట్రంలోనే మొదటి పీజీ కోర్సు

- అందుబాటులో ఎమ్మెస్సీ ఫిషరీస్
- పరిశోధనతో పాటు ఉపాధి మార్గాలు
- చేపల కొలను, ప్రత్యేక మ్యూజియం
- ఆక్వా క్లినిక్స్ ద్వారా ఫీడ్, సీడ్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు ఉపాధికి ఊతమిచ్చే కోర్సులు ఎన్నో. అలా భరోసా కల్పిస్తున్న కోర్సుల్లో ఒకటే ఎమ్మెస్సీ ఫిషరీస్. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుబంధ పీజీ కాలేజ్‌లో ఎమ్మెస్సీ ఫిషరీస్ కోర్సు అందుబాటులో ఉంది. రాష్ట్రం మొత్తంలో ఫిషరీస్‌లో పీజీ స్థాయి కోర్సు సిద్దిపేటలో ఉండడం విశేషం. ఈ కోర్సు ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవటమే కాకుండా మత్స్య సంపదను కాపాడేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తూ, సరికొత్త పరిశోధనలకు నాంది పలుకుతున్నారు. ఇక్కడి విద్యార్థి 45 రకాల చేప జాతులను సేకరించి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాడు. మరికొంతమంది కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కొందరు ఇంటర్నేషనల్ జర్నల్స్ రాసి పలువురి మెప్పు పొందుతున్నారు.



ప్రత్యేక మ్యూజియంలో భద్రపరిచిన వివిధరకాల చేపల నమునాలు



కళాశాలలో ఏర్పాటు చేసిన చేపల కోలను (ఫిష్ పాండ్)

ప్రస్తుతం ఆరో బ్యాచ్

2017-18 విద్యా సంవత్సరం నుంచి ఎమ్మెస్సీ ఫిషరీస్ కోర్సు మంజూరైంది. ప్రస్తుతం ఆరో బ్యాచ్ నడుస్తున్నది. గతేడాదే సీట్లను రెండింతలు చేయగా ప్రస్తుతం ఈ విభాగంలో 60 సీట్లు ఉన్నాయి. డిగ్రీ బీఎస్సీ తర్వాత ఎమ్మెస్సీ జువాలజీలో ఆప్షనల్‌గా ఫిషరీస్‌ను ఎంచుకోవచ్చు. దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లు మొదలయ్యాక విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇతర జిల్లాల నుంచి కోర్సును అభ్యసించడానికి వస్తున్నారు.

400 రకాల చేపల నమూనాలు

విద్యార్థుల అభ్యసనం కోసం చేపల కొలను(ఫిష్ పాండ్), ప్రత్యేక



ల్యాబ్‌లో పరిశోధన చేస్తున్న ఫిషరీస్ స్టూడెంట్స్

మ్యూజియం ఏర్పాటు చేసి సుమారు 400 రకాల చేపల నమునాలను భద్రపరిచారు. ఆక్వా సిస్టంకు సంబంధించిన అధునాతన వ్యవస్థలైన ఆర్ఏఎస్, బయోఫ్లాక్ విధానాలతో విద్యార్థులను పరిశోధనల వైపు ప్రొత్సహిస్తున్నారు. ఆక్వా కల్చర్ కోసం తక్కువ ఖర్చులో ఎక్కువ ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని హేచరీల నిర్మాణం చేపట్టారు. సహజ పద్ధతిలో చేపల ఉత్పత్తికి కృషి చేస్తున్నారు.

ఆక్వా క్లినిక్

గ్రామాల్లో చిన్న చిన్న కుంటలు, చెరువులను తీసుకుని చేపల పెంపకం చేస్తున్నారు. కొంతమంది విద్యార్థులు ఆక్వా క్లినిక్స్ ఏర్పాటు చేసి చేపల పెంపకందారులకు అవసరమయ్యే సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఆక్వా క్లినిక్స్ ద్వారా సీడ్ సప్లైతో పాటుగా వాటికి అవసరయ్యే ఫీడ్‌ను కూడా సరఫరా చేస్తున్నారు. చేపలకు వ్యాధులు సంక్రమిస్తే అందుకు సంబంధించిన మెడిసిన్‌ను అందిస్తున్నారు. వాటర్ పారామీటర్‌ను పరీక్షించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెబుతున్నారు. నీళ్ల, గోదుమల ద్వారా పారామిశీయం కల్చర్ చేసి చేప పిల్లలకు ఆహారంగా ఇస్తున్నారు. ఇదంతా అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులే చేస్తుంటారు.



ఎమ్మెస్సీ ఫిషరీస్ విభాగం

ఉద్యోగావకాశాలుంటాయని చేరాను



మాది జయశంకర్ భూపాలపల్లి జిల్లా. ఫిషరీస్ చదవటం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని ఈ కోర్సు చేస్తున్నాను. కొత్త కోర్సు కాబట్టి ఎక్కువ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. అందుకనుగుణంగా ఇక్కడ బోధన జరుగుతుంది. భవిష్యత్‌లో ఉపయోగపడే పరిశోధనలను నేర్చుకోవటం బాగుంది.

- ప్రతిభారాణి, విద్యార్థిని

మత్స్య పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి



విద్యార్థులకు ఫిషరీస్ కోర్సు వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలుంటాయి. విద్యార్థులకు పరిశోధన జ్ఞానం పెరిగేవిధంగా వివిధ రకాలైన ఆక్వాపోనిక్స్, రాస్, హేచరీస్, బయోఫ్లాక్ వంటి సిస్టమ్‌ను ఏర్పాటు చేశాం. కళాశాలలో మత్స్య పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులతో పాటుగా రైతులకు ఎంతో మేలు జరుగుతోంది.

- అయోధ్యరెడ్డి, ఫిషరీస్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల

బాహాబాహీ

- కొనుగోలు కేంద్రంలో ప్రారంభంలో ఘర్షణ
- ఇరు వర్గాల మధ్య తోపులాట



కొనుగోలు కేంద్రం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదం

శివ్వంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో బాహాబాహీకి దిగడంతో తోపులాట జరిగింది. గురువారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెద్ద గొట్టిముక్కల, శివ్వంపేట, రత్నాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే సునీతారెడ్డిచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కాగా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి రావడానికి ఆలస్యమవుతుందని సీఈవో మధుకు సమాచారం ఇవ్వడంతో కాంగ్రెస్‌కు చెందిన పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తర్వాత శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం ఎదుట కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వెంకట్రామిరెడ్డి రాగా.. ఎమ్మెల్యే సునీతారెడ్డి వచ్చేవరకూ ప్రారంభించొద్దని బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్ యాదగౌడ్, పెంటగౌడ్ అనడంతో.. ఇరుపార్టీలకు చెందిన నాయకులు బాహాబాహికి దిగి.. తోపులాడుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కాంగ్రెస్ జిందాబాద్.. బీఆర్ఎస్ జిందాబాద్ అంటూ ఇరువర్గీయులు పెద్దఎత్తున నినాదాలు చేసుకున్నారు. చివరకు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్య

సిద్దిపేట క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం వెలుగులోకి వచ్చింది. వన్ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన బోధనకారి విశ్వసాయి(22) మొబైల్ షాప్‌లో పనిచేస్తున్నాడు. పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కొన్నాళ్లకు వారి మధ్య మనస్పర్థలు రావడంతో దూరమయ్యారు. దీంతో తన ప్రేమ విఫలమైందనదంటూ తల్లి జయమ్మకు, కుటుంబ సభ్యులతో తరచూ ఆవేదన వ్యక్తం చేస్తుండేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10.30 గంటలకు బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అనంతరం కోమటి చెరువులో దూకి చనిపోతున్నానంటూ విశ్వసాయి తన స్నేహితులకు ఫోన్ ద్వారా మెసేజ్ పంపించాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అదేరాత్రి అక్కడికి చేరుకుని గజ ఈత గాళ్లతో బయటకు తీసిన యువకుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ మృతి చెందాడని వైద్యులు చెప్పారు.

విలీనంపై వివాదం

ఐదో పేజీ తరువాయి

ఏర్పాట్లు ఉంటాయని చెబుతున్నారు. వీటన్నింటి దృష్ట్యా హైదరాబాద్ ఏ జోన్‌లో ఉంటే ఆ జోన్‌లోనే మార్పు చేయాలని కోరుతున్నారు. తాజాగా టీఎన్జీవో ఉద్యోగులు మంత్రులకు, ఉద్యోగ సంఘాల నేతలకు వినతిపత్రాలు ఇవ్వడం ప్రారంభించారు.

హుస్నాబాద్ నుంచి అభ్యంతరాలు

భౌగోళిక పరిస్థితి దృష్ట్యా తమకు కరీంనగర్ జిల్లాతోనే సంబంధాలు ఉంటాయని, తమకు సిద్దిపేట జిల్లా ఎడమచేతి వాటంగా ఉందని హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో కరీంనగర్ జిల్లాలో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంతోపాటు అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలను సిద్దిపేటలో విలీనం చేశారు. ఆనాడు సిద్దిపేట వైపే మొగ్గుచూపారు. ఈ మండలాల అభివృద్ధి విషయంలో నాడు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు శ్రద్ధ పెట్టడంతో ఆ ప్రాంత ప్రజలు కూడా సర్దుకున్నారు. అయితే కాలక్రమేణా హుస్నాబాద్ ప్రాంత ప్రజలు మళ్లీ కరీంనగర్ వైపే చూస్తున్నట్లుగా అర్థమవుతోంది. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయంలో గట్టిగా పట్టుబడుతున్నారు. బలవంతంగా సిద్దిపేట జిల్లాలో కలిపిన నాలుగు మండలాలను తిరిగి కరీంనగర్‌లో కలుపుతానని చెబుతున్నారు. ఈ విషయంలో పలు కార్యక్రమాలు చేపట్టిన వారికి ఆయన మద్దతుగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు తెలిసింది.

మెదక్ కష్టం.. సంగారెడ్డి ఇష్టం

ఉమ్మడి మెదక్ జిల్లాను విభజించిన సమయంలో నాలుగు మండలాలను అశాస్త్రీయంగా విభజిత మెదక్ జిల్లాలో విలీనం చేశారనే విమర్శలు వచ్చాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉన్న పెద్దశంకరంపేట మండలం, అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాలను సంగారెడ్డిలోనే ఉంచాలనే విన్నపాలు వస్తున్నాయి. పెద్దశంకరంపేట మండలం విషయంలో అప్పటి నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అసెంబ్లీలో సైతం మాట్లాడారు. ఇక టేక్మాల్, రేగోడ్, అల్లాదుర్గం మండలాల ప్రజలకు సంగారెడ్డి జిల్లాతోనే సంబంధాలు ఉన్నాయని ప్రస్తుత మంత్రి దామోదర రాజనర్సింహ పలుమార్లు చెప్పుకొచ్చారు. ఈ మూడు మండలాలను తిరిగి సంగారెడ్డి జిల్లాలోనే విలీనం చేయిస్తానని అన్నారు. జోన్ల మార్పులు, చేర్పులు సంబంధిత 317 జీవో చైర్మన్‌గా ఉన్న రాజనర్సింహ ఈ విషయంలో పట్టుబడుతున్నట్లుగా తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ జిల్లాలు, జోన్ల మార్పును ఉమ్మడి మెదక్ జిల్లాకు మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలించే అవకాశం ఉంది. ఈ విషయంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.



సమావేశంలో పాల్గొన్న డీడీఎస్ మహిళాసంఘాల సభ్యులు

మహిళాసాధికారతకు డీడీఎస్ కృషి

- డీడీఎస్ చైర్మన్, ప్రొఫెసర్ బీపీ సంజయ్

జహీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతంలోని పస్తాపూర్‌లో 40 ఏళ్ల క్రితం ఏర్పాటైన డీడీఎస్ (డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ) మహిళా సాధికారిత కోసం కృషి చేస్తున్నదని డీడీఎస్ చైర్మన్ ప్రొఫెసర్ బీపీ సంజయ్ అన్నారు. పట్టణంలోని పస్తాపూర్‌లోని డీడీఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. డీడీఎస్ పనితీరును దేశ, విదేశాల ప్రముఖులు ప్రశంసించారన్నారు. సంస్థతోపాటు చేపట్టే కార్యక్రమాల వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. గతంలో పనిచేసి వివిధకారణాలతో బహిష్కరణకు గురైన కొందరు ప్రస్తుతం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వారిపై చట్టరీత్య చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమన్నారు. సంఘం సభ్యులు ఆరోపణలను పక్కనబెట్టి పనులతో ముందుకుసాగాలన్నారు.

బదనాం చేస్తే ఊరుకోము..

నిరుపేద, అనాథ మహిళలకు అక్కున చేర్చుకుని బతుకుబాట నేర్పిన ఘనత దివంగత డీడీఎస్ డైరెక్టర్ పీవీ సతీష్‌కే దక్కిందని ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ గిరిధర్, డీడీఎస్ మహిళాసంఘాల సభ్యులు నాగమ్మ, నర్సమ్మ, చంద్రమ్మ, మొగులమ్మ, స్వరూపమ్మ, లక్ష్మమ్మ, సూర్యకళ, సరెమ్మ తదితరులు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుపేదలకు అన్నంపెట్టే డీడీఎస్ పనితీరును చూసి జీర్ణించుకోలేక కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పుడు విమర్శలు చేస్తే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. డీడీఎస్ తమకు తోడ్పాటునందించి బతుకు బాటను నేర్పిందన్నారు. వాస్తవాలుంటే పక్కా ఆధారాలతో డీడీఎస్ సంస్థ అధినేతలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. డీడీఎస్‌ను అణగదొక్కే ప్రయత్నం మానుకోవాలన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే సహించబోమని, అవసరమైతే డీడీఎస్ పక్షాన రోడ్డెక్కి ఆందోళనలను చేయాల్సి వస్తుందన్నారు.

ఆలయాల్లో చోరీ నిందితుల అరెస్టు

- ఆరు కేసులను ఛేదించిన గజ్వేల్ డివిజన్ పోలీసులు
- రెండు బైకులు, బంగారం, వెండి, రాతి విగ్రహాలు స్వాధీనం

గజ్వేల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. దీనికి సబంధించిన వివరాలను ఏసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి వెల్లడించారు. మంగోల్ చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తుండగా రెండు మోటార్‌సైకిళ్లపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించగా పలు ఆలయాల్లో చోరీకి పాల్పడినట్లు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే గజ్వేల్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీకి చెందిన పర్వతం నర్సింహులు, పర్వతం పరుశరాములు అదే కాలనీకి చెందిన నూనె కుమార్, మోతె(తుప్పతి) సాదుల్లా అక్టోబరు మొదటివారంలో కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలోని ఎల్లమ్మ గుడిలో హుండీ డబ్బులు, అమ్మవారి బంగారు ముక్కుపుడక, వెండి బొట్టు తస్కరించారు. అలాగే గజ్వేల్ నుంచి ఆరేపల్లి వెళ్తుండగా ఉన్న పెద్దమ్మ గుడిలో దేవతల రాతి విగ్రహాలు, గజ్వేల్‌లోని పాండవుల చెరువు కట్టపై ఉన్న హనుమాన్ దేవాలయంలో మైక్‌సెట్, హుండీ నగదు చోరీ చేశారు. అంతేకాకుండా కొండపాక మండల కేంద్రంలోని శివాలయంలో, రవీంద్రనగర్‌లోని హనుమాన్ దేవాలయాలు చోరీకి పాల్పడ్డారు. చోరీ సొమ్మును అమ్మేందుకు సిద్దిపేటకు వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మూడు దొంగతనాల కేసులు, గజ్వేల్, రాయపోల్ పోలీస్‌స్టేషన్లలో ఒక్కో చోరీ కేసులున్నాయి. ఇక చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ పరిధి విఠలాపూర్‌లోని ఓ ఇంటి ఆవరణలో మంచంపై పడుకున్న మహిళ మెడలో పుస్తెల తాడును పర్వతం నర్సింహులు, దుబ్బాక మండల కేంద్రానికి చెందిన నూనె పర్వతం సంపత్ అపహరించారు. నిందితుల నుంచి రెండు మోటార్ సైకిళ్లు, అమ్మవారి బంగారు ముక్కుపుడక, వెండి నుదుటిబొట్టు, రాతి విగ్రహాలు, మైక్‌సెట్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన ఆరు కేసులను చాకచక్యంగా ఛేదించిన సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గుర్తుతెలియని

యువకుడి మృతదేహం కలకలం

- హత్య చేసి ఒంటికి నిప్పంటించిన దుండగులు

చిన్నశంకరంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం గురువారం కలకలం రేపింది. ఉదయం విధులకు చేరుకున్న వైద్య సిబ్బంది ఆసుపత్రి వెనుకాల డోర్ తెరువగానే గుర్తు తెలియని యువకుడి మృతదేహం (30) కనిపించింది. ఒక్కసారిగా బయాందోళనకు గురైన సిబ్బంది వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నారాయణగౌడ్ ఘటన స్థలానికి చేరుకొని కాలిన మృతదేహాన్ని పరిశీలించారు. సమాచారం అందుకున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీంని రప్పించి ఆధారాలను సేకరించారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలలు, రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి దుండగులు యువకుడిని బండరాళ్లతో మోది నిప్పుపెట్టి హత్య చేసి ఉంటారని చెప్పారు. మృతదేహం ఆచూకీ కోసం చిన్నశంకరంపేట ఎస్ఐ 8712657987, రామాయంపేట సీఐ 8712657933 నెంబర్లను సంప్రదించాలన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి



హుస్నాబాద్‌లోని ఆసియాలో అతిపెద్ద రెండవ అమరవీరుల స్తూపం(ఫైల్)

నేలమట్టమైనా చెదరని జ్ఞాపకం..

- అమరవీరుల స్తూపం ఆవిష్కరణ జరిగి నేటికి 34 ఏళ్లు
- 2000 లో ధ్వంసం.. పీపుల్స్ వార్ చరిత్రను గుర్తు చేస్తున్న శిథిలాలు

హుస్నాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అది 1990 అక్టోబరు 25.. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో నిలిచిపోయిన రోజు. నాటి పీపుల్స్‌వార్, నేటి మావోయిస్టు పార్టీ ఉద్యమ చరిత్ర పుటల్లో సువర్ణక్షరాలతో లిఖించబడిన రోజు. పీడిత ప్రజల విముక్తి కోసం పోరుబాటలో అసువులు బాసిన వారి స్మారకార్థం 1990 హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన అసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద అమరవీరుల స్తూపాన్ని ఆవిష్కరించిన రోజు. ఇది ఆవిష్కరించి శుక్రవారానికి సరిగ్గా 34 ఏళ్లు అవుతుంది. ఇది పీపుల్స్‌వార్ ఉద్యమ అటుపోట్లకు సాక్షిగా నిలుస్తుందని భావించినప్పటికీ ఇది వర్గ పోరులో పదేళ్లలోనే నేల మట్టమైంది. 1989 నుంచి సంవత్సరం పాటు అప్పటి పీపుల్స్‌వార్ ప్రతినిధులు 1972-89 మధ్యకాలంలో ఎదురుకాల్పుల్లో మృతి చెందిన 88 మంది పేర్లతో వారి స్మారకార్థం అక్కన్నపేట రోడ్డులోని ఎత్తైన ప్రదేశంలో 88 అడుగుల ఎత్తుతో గ్రానైట్ రాయితో స్తూపాన్ని నిర్మించారు. దీని నిర్మాణ సమయంలో హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామానికి చెందిన బొమ్మగాని నారాయణ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్తూప ఆవిష్కరణకు ప్రభుత్వం అభ్యంతరం తెలపడంతో అప్పుడు ఇక్కడ పని చేస్తున్న వయోజన విద్య ప్రాజెక్టు అధికారి శేషకుమార్, ఎఈ బాల్‌లింగారెడ్డి, ఎంఆర్‌వో రాజమౌళిలను కిడ్నాప్ చేశారు. స్తూపం ఆవిష్కరణకు అవరోధం కల్పించవద్దని స్థానిక దళం డిమాండ్ చేయడంతో 25 అక్టోబర్ 1990న వేలాది ప్రజల మధ్య దీనిని పోరుబాటలో అమరుడైన పులి రాములు తండ్రి స్తూపాన్ని అవిష్కరించారు. దీనికి ప్రజాయుద్ధనౌక గద్దర్, విప్లవరచయితల సంఘం నాయకులు వరవరరావు, బాలగోపాల్ వంటి నేతలు హాజరయ్యారు. ఎక్కడ పీపుల్స్ వార్ సంఘటనలకు పాల్పడినా దీనిని ధ్వంసం చేసేందుకు యత్నించారు. అలా మూడుసార్లు దీనిని కూల్చివేసేందుకు ప్రయత్నించడంతో పాక్షికంగా దెబ్బతిన్నది. జనవరి 2000 సంవత్సరంలో హుస్నాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బొప్పరాజు లక్ష్మీకాంతరావు ఇంటిని నక్సలైట్లు పేల్చివేయడంతో ప్రతిగా గ్రీన్‌టైగర్స్ పేరుతో స్తూపాన్ని డిటోనేటర్లు పెట్టి పూర్తిగా ధ్వంసం చేశారు. భౌతికంగా స్తూపం నేలమట్టమైనా ఈ శిథిలాలు ఈ ప్రాంత పీపుల్స్‌వార్ చరిత్రను జ్ఞాపకం చేస్తూనే ఉన్నాయి. అమరుడైన ప్రజా యుద్ధనౌక గద్దర్ ఈ స్తూపాన్ని మళ్లీ నిర్మించాలని ఆకాంక్షించేవారు. పలు మార్లు దీనిని సందర్శించి ఉద్యమ నెత్తుటి చరిత్రను ఆటపాటలతో వివరించేవారు. కాగా ఇటీవల నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్, జర్నలిస్టు జహిరొద్దిన్ అలిఖాన్ వర్ధంతితోపాటు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని స్తూపం వద్ద నిర్వహించారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కాగా స్తూపాన్ని మళ్లీ నిర్మించాలని పలువురు కోరారు.



స్తూపం కూలినప్పటి దృశ్యం(ఫైల్)

అతివలకు ఆర్థిక చేయూత

● సెర్ప్ ఆధ్వర్యంలో నాటు కోళ్ల పంపిణీ

● మహిళలకు ఆర్థిక అభివృద్ధితో పాటు ఆరోగ్యం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మహిళా సంఘాల సభ్యులకు పలు రకాల యూనిట్లు నెలకొల్పే అవకాశం కల్పిస్తున్నారు. సూక్ష్మ సంస్థలు, కుట్టు మిషన్ కేంద్రాలు, ప్లాస్టిక్ వేస్ట్‌మేనేజ్మెంట్, మీ సేవా కేంద్రాలు, ఫుడ్ కోర్టులు, ఫుడ్ ప్రాసెసింగ్, పాల ఉత్పత్తుల అమ్మకం, పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకం ఇలా పలు యూనిట్లు నెలకొల్పేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను అందజేసి ప్రోత్సహిస్తున్నారు. మహిళలకు ఆర్థిక అభివృద్ధితో పాటు పోషక విలువలతో కూడిన మాంసాహారం ప్రజలకు అందించేందుకు 'ఆర్థిక అభివృద్ధి.. ఆరోగ్యం' అనే ఆలోచనతో నాటుకోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో ఆసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్నారు.


పంపిణీ చేసిన కోళ్లను చూపుతున్న మహిళలు

అస్లీమ్ జాతి కోళ్ల పంపిణీ

పంపిణీ చేసే నాటు కోళ్లలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి అస్లీమ్ జాతికి చెందినది కాగా, మరొకటి సోనాలి జాతి. అస్లీమ్ జాతి కోడి ఒక్కొక్కటికి రూ.105 చొప్పున ధర నిర్ణయించారు. దీని బరువు సుమారు 400 గ్రాముల నుంచి 700 గ్రాముల మధ్యలో ఉంటుంది. సోనాలి జాతి కోడి ధర ఒక్కొక్కటి రూ.140 చొప్పున నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలో అస్లీమ్ జాతి నాటు కోళ్లను పంపిణీ చేస్తున్నారు. సిద్దిపేట అర్బన్ మండల వ్యాప్తంగా 12 గ్రామపంచాయతీల్లో మహిళా సంఘాలకు ముందస్తుగా సమాచారం అందించి ఒక జాబితా తయారుచేసి నాటు కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్నవారికి కోళ్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే 2,040 అస్లీమ్ జాతి కోళ్లను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ వ్యక్తులు ఫామ్‌హౌస్‌లలో, ఓపెన్ ప్రదేశాలలో కోళ్ల పెంపకం చేస్తూ ఉండడంతో వాళ్ల వద్ద నుంచి కోళ్లను కొనుగోలు చేసి అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక అభివృద్ధితో పాటు ఆరోగ్యం

కొన్నేళ్ల క్రితం ప్రతీ గ్రామంలో నాటు కోళ్ల పెంపకం ఉండేది. పండుగలు వస్తే నాటు కోళ్ల మాంసం తినడానికి ప్రజలు ఆసక్తిగా ఉండేవారు. ప్రకృతి సిద్ధంగా పెరిగే కోడి కావడం వల్ల పౌష్టికాహార విలువలతో కూడిన మాంసం అందేది. నేడు బ్రాయిలర్ కోళ్ల పెంపకం ఎక్కువ కావడం, అంతటా విరివిగా లభిస్తుండడంతో ఈ మాంసాన్ని ఎక్కువగా కొనుగోలు చేసి తింటున్నారు. దీంతో అనారోగ్య పరిస్థితులు తప్పడం లేదు. మళ్లీ నాటుకోడి పెంపకం ద్వారా ఆనాటి రోజులు గుర్తుకు వచ్చేలా ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు సెర్ప్ అధికారులు తెలిపారు.

ఆసక్తి ఉన్నవారికి అందిస్తాం

నాటు కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి వారికి మొదటి విడతగా రెండు వేలకు పైగా కోళ్లను ఇప్పటికే పంపిణీ చేశాం. ఇంకా గ్రామాల్లో ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి రెండో విడత కూడా పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. మదర్ కమిటీ తరఫున పెంపకం చేపడతామంటే పెద్దఎత్తున కూడా పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

- సాగర్, ఏపీఎం, సిద్దిపేట అర్బన్ మండలం

జిల్లా వివరాలు	
మండలాలు	23
గ్రామైక్య సంఘాలు	726
మహిళా స్వయం సహాయక సంఘాలు	18,261
సభ్యులు	1,93,508

రాజకీయం మాని.. పరిహారం ఇవ్వండి

● సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ

గజ్వేల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూ నిర్వాసితులపై అధికార, ప్రతిపక్షాలు రాజకీయం చేయకుండా పరిహారం అందించాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి దాదాపు ఏడు సంవత్సరాలు కావస్తున్నా భూ నిర్వాసితులకు రావల్సిన పరిహారం అందలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బట్టు దయానందరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు స్వర్గం రాజేశం, గజ్వేల్ నియోజకవర్గ సీపీఐ నాయకులు పోచయ్య, రాజం, బిక్షపతి పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలు గత ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందన్నారు. సమావేశంలో సీసీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, నాయకులు బండ్ల స్వామి పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న శివలింగు కృష్ణ

పోలీసులకు వ్యాసరచన పోటీలు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకుని ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ల వారీగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలకు 'సమాజంలో పోలీసు ప్రతిష్ఠను మెరుగుపరచడంలో పోలీసుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్ఐ నుంచి పై స్థాయి అధికారులకు 'దృఢమైన శరీరంలో దృఢమైన మనస్సు' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. రెండు విభాగాల నుంచి ముగ్గురు చొప్పున ఆరుగురి పేర్లు రాష్ట్రస్థాయికి పంపిస్తామని తెలిపారు.

● హుస్నాబాద్ టౌన్: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో డివిజన్ పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు సమాజంలో పోలీసు ప్రతిష్ఠను మెరుగు పర్చడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్ ఉన్నారు.


సిద్దిపేట క్రైం: వ్యాసరచన పోటీల్లో పోలీసు సిబ్బంది

ప్రజా సమస్యలపై కొట్లాడే పార్టీ బీజేపీ

కోహెడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలపై అనునిత్యం కొట్లాడే పార్టీ బీజేపీ అని, బీజేపీని విమర్శించే నైతికత కాంగ్రెస్ నాయకులకు లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. కోహెడలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నాయకులెవరూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, కాంగ్రెస్‌ను విమర్శించలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి గగ్గోలు పెట్టడంపై ఆయన మండిపడ్డారు. మోసపూరిత హామీల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లి ఎండగడతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ద్యాగటి సురేందర్, పార్టీ శ్రేణులు పిల్లి నర్సయ్య, జాలిగం రమేష్, గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్, రామంచ రాంచంద్రరెడ్డి, కొండబత్తిని సతీష్, ఎడమల రాజు, ముంజ సాగర్‌గౌడ్, సుధాకర్, పీ సాగర్, దుర్గేశం, కోనేటి శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జగదేవ్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్స్ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ పనిచేస్తున్నదని ఆ సంఘం మండల అధ్యక్షుడు అంకం వెంకటేశ్వర్లు అన్నారు. వివిధ పాఠశాలల్లో కొత్తగా విధుల్లో చేరిన 15 మంది టీచర్లకు సర్వీస్ బుక్, ప్రాన్ ఫామ్స్, టీఎస్జీఎల్ఐసీ ఫామ్స్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పృథ్వీ, మొహిన్‌ద్దీన్ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం

కుకునూరుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముద్దాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠకు రావాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని గ్రామ ముదిరాజ్ సంఘం కుల పెద్దలు గురువారం గజ్వేల్‌లో కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కాగిత బిక్షపతి, రిప్పల సాయిలు, సత్తయ్య, రిప్పల స్వామి, బాలయ్య, రాజు తదితరులు ఉన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు హుస్నాబాద్ నుంచి బస్సులు

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని హుస్నాబాద్ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. నవంబరు 13న ప్రారంభమై 16న యాత్ర పూర్తవుతుందన్నారు. పెద్దలకు రూ. 4500, పిల్లలకు రూ. 3800 టికెట్ చార్జీలు ఉంటాయన్నారు. హుస్నాబాద్ ఆర్టీసీ బను పాస్ కౌంటర్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

చేర్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మునిసిపల్ పరిధిలోని 9వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మునిసిపల్ ఛైర్‌పర్సన్ అంకు గారి స్వరూపారాణి, కమిషనర్ నాగేందర్ గురువారం పరిశీలించారు. పనులను నాణ్యతతో, ప్రమాణాలు పాటించి చేపట్టాలని సూచించారు.

జాతీయ రహదారి ప్రతిపాదనను మార్చాలి

● ఎంపీకి ప్రజల వినతి

కొండపాక,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 365బి నిర్మాణం కోసం కేంద్రం ప్రతిపాదించినట్టుగా కాకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని పలుగ్రామాల నాయకులు, ప్రజలు ఎంపీ రఘునందన్ రావును కోరారు. వారు హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో గురువారం ఆయన్ను కలిశారు. మండలంలోని మర్పడగ, ఖమ్మంపల్లి, తప్పపల్లి గ్రామాలమీదుగా ప్రతిపాదించిన మార్గాన్ని మార్చి ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని ఈ సందర్భంగా వారు విన్నవించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన మార్గంలో మూడుగ్రామాల రైతులకు పుష్కలమైన నీటి సౌకర్యం ఉన్నందున సంవత్సరానికి రెండు పంటలు పండిస్తూ జీవిస్తున్నారని తెలిపారు. పంటలు పండే పొలాలు మీదుగా జాతీయ రహదారిని ప్రతిపాదించినందున రైతులు బతుకుదెరువును కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. వారివెంట మాజీ ఎంపీటీసీ యాదగిరి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, పలువురు రైతులు ఉన్నారు.


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

● అధికారులు, చైర్మన్లు


దౌల్తాబాద్ మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

కొండపాక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని రవీంద్రనగర్, దర్గా , జప్తి నాచారం, ఖమ్మంపల్లి, గిరాయిపల్లి గ్రామాల్లో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ దిలీప్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ మగ్దుమ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు లింగారావు, సురేందర్, కనకరాములు వెంకటేష్ గౌడ్ తదితరులున్నారు.

● దౌల్తాబాద్: మండల కేంద్రమైన దౌల్తాబాద్‌తో పాటు సూరంపల్లి, ముత్యంపేట, ముబారస్పూర్, హైమాద్‌నగర్, మల్లేశంపల్లి, మహమ్మద్‌షాపూర్, ఇందుప్రియల్, గొడుగుపల్లి, ఉప్పరపల్లి, గువ్వలేగి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఏపీఎం యాదగిరి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జహీర్, సీసీలు బాల్‌రాజ్, సునీత, నాగరాజు, లక్ష్మణ్, వైకుంఠం, కనకరాజు, మహేష్, ఏఈవోలు సంతోష్, బాపురాజు, సునంద, శిరీష తదితరులున్నారు.

● నంగునూరు: మండలంలోని సిద్దన్నపేట, ఘనపూర్, కొండంరాజుపల్లి, నంగునూరు ఆరేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నంగునూరు సొసైటీ చైర్మన్ కోల రమేష్‌గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఆర్ఐ లింగం, మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి, మాజీ సర్పంచ్ చెత్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మద్దూరు: మండలంలోని నర్సాయపల్లి, అర్జున్‌పట్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత, వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం బాబురావు, జిల్లా నాయకుడు జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు కమలాకర్‌యాదవ్, దూళిమిట్ట మండల అధ్యక్షుడు కోల సాయిలు, ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, ఏఎంసీ డైరెక్టర్ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ భీంరెడ్డి మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

పన్నులు సకాలంలో వసూలు చేయాలి

● డీపీవో దేవకీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో దేవకీదేవి

చేర్యాల, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ పన్నులను సకాలంలో వసూలుచేసి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల గ్రామపంచాయతీ కార్యదర్శులతో గురువారం మండలంలోని ముస్త్యాల గ్రామ రైతువేదికలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పన్నుల వసూలు, తాగునీటి సరఫరా, భవన నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. విధుల నిర్వహణలో చిత్తశుద్ధితో పాటుపడాలని, తమ గ్రామాలను ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్పీవో ఎం.మల్లికార్జున్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ, కొమురవెల్లి ఎంపీవో శ్రీనివాస్‌వర్మ, మద్దూరు ఎంపీవో వీరరాజు, మిషన్ భగీరథ డీఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

● ఎంపీవో శ్రీనివాస్


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్

రాయపోల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. వడ్డెపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చిరిగిన గన్నీ సంచులతో ఇక్కట్లు


చిరిగిన గన్నీ సంచులు

మద్దూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై శాఖ ఆదేశాల మేరకు గోదాం, మిల్లుల నుంచి సరఫరా చేసిన గన్నీ సంచుల్లోంచి చిరిగిన వాటిని తిరిగి తీసుకోవడంలో తాత్సరం చేస్తుండటంతో లక్షల్లో నష్ట పోవాల్సి వస్తోందంటూ సొసైటీ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గత సీజన్‌లో గోదాం, మిల్లుల నుంచి సరఫరా చేసిన గన్నీ సంచుల కట్టల్లో కొన్ని తక్కువగా రావడంతో పాటు చాలా మటుకు చిరిగిపోయి పనికిరానివి వచ్చాయి. కాగా సరఫరా చేసిన గన్నీ సంచులకు కనీసం 10 శాతం తరుగు కింద తీసేయాలని లిఖితపూర్వకంగా సిబ్బందికి విన్నవించారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన వారంలో చిరిగిన గన్నీ సంచులను తిరిగి తీసుకోవాలని కోరినప్పటికీ గోదాం నిర్వాహకులు పట్టించుకోలేదని చెబుతున్నారు.

● పనికిరాని 18 వేల సంచుల్ని వెనక్కితీసుకోవాలి

నాణ్యమైన గన్నీ సంచులే అందించాలి



గత సీజన్‌లో రేబర్తి సహకార సొసైటీ ఆధ్వర్యంలో 14 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. సివిల్ సప్లై ఆదేశాల మేరకు గోదాం, మిల్లుల నుంచి సరఫరా చేసిన 3,56,450 గన్నీ సంచుల్లో కొత్తవి 2,53 లక్షలు కాగా పాతవి 1,03,450. ఇందులో సుమారు 18 వేల గన్నీ సంచులు పూర్తిగా పనికిరానివి వచ్చాయి. వీటిని పక్కకు పెట్టాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముగిసిన వెంటనే వాటిని వాపసు తీసుకోవాలని కోరాం. ఒక్కో సంచికి రూ.50ల చొప్పున సుమారు రూ 9.50 లక్షలకు పైగా నష్టపోవాల్సి వస్తోంది. సొసైటీకి మంచి గన్నీ సంచులు అందిస్తే తప్ప వ్యాపారం నిర్వహించ లేని పరిస్థితి.

- బోయిని శ్రీధర్ సొసైటీ సీఈవో మద్దూరు

దళారుల దోపిడీ

ఐదో పేజీ తరువాయి

ప్రకటించినా మిల్లుల్లో మాత్రం క్వింటాలుకు రూ.1900లోపే చెల్లిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హార్వేస్టర్ ద్వారా వరి పంట కోయగానే దళారులు చేను వద్ద వాలిపోతున్నారు. పచ్చి వడ్లను (ధాన్యం) ట్రాక్టర్లలో నింపి మిల్లులకు చేరవేస్తున్నారు. ధాన్యం ఆరబోయడం, తాలు తీయడం, తేమశాతం పరీక్షించడం, క్రమ సంఖ్య ఆధారంగా కొనుగోలు చేయడం, రోజుల తరబడి వేచి చూడడం, తాలు, తరుగు, కటింగ్ లాంటివి లేకుండా నేరుగా దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కల్లాలు అందుబాటులో లేకపోవడం, ఆరిన తర్వాత ధాన్యం తూకం తగ్గే అవకాశాలు ఉండటంతో రైతులు మిల్లర్లు, దళారులకు విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. కొంతమంది రైస్‌మిల్లులకు నేరుగా అమ్ముతుండగా, మరికొన్ని చోట్ల దళారులు రంగప్రవేశం చేసి రైతుల శ్రమను దోచుకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్‌కు ధాన్యానికి రూ.1800 నుంచి 1900 వరకు చెల్లించి రైతుల నేరుగా కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది దళారులు మిల్లర్లకు అమ్మి ప్రభుత్వం ఇచ్చే ధర పొందుతున్నట్లు తెలుస్తుంది.

గౌరవెల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ నేత 'చాడ'


నీటి పారుదలశాఖ ముఖ్య సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ గౌరవెల్లి రిజర్వాయర్ భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి గురువారం రాష్ట్ర నీటి పారుదలశాఖ ముఖ్య సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్, ఈఎన్‌సీ అనిల్‌కుమార్‌కు హైదరాబాద్‌లో నిర్వాసితులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపుకు గురైన నిర్వాసితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహ, గడిపె మల్లేశ్, అందె స్వామి, లక్ష్మారెడ్డి, రాజయ్య, బోయిని భాస్కర్, బద్దం ఎల్లారెడ్డి తదితరులున్నారు.

సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి

● సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ


చెక్కును అందజేస్తున్న పోలీస్ కమిషనర్

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ సలీం కుటుంబ సభ్యులకు ఏడు లక్షల 90 వేల రూపాయల ప్రమాద బీమా చెక్కును గురువారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భద్రతా పథకం సిబ్బంది కుటుంబాలకు ఆర్థికంగా నిలదుకోవడానికి బాసటగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏవో యాదమ్మ, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు మన్నె రవీందర్‌రెడ్డి, సలీమ్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న నర్సారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం చేకూరుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం అక్కారంకు చెందిన 7, 8వ వార్డుల బీఆర్ఎస్ తాజా మాజీ వార్డు సభ్యులు నర్సారెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు న్యాయం చేయాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు సుఖేందర్, అక్కారం యాదగిరి, రాజు, రామాగౌడ్, మాజీ ఎంపీటీసీ కవితరాజు, నీలారెడ్డి, మన్సూర్, నరేశ్‌గౌడ్, కొనాపూర్ యాదగిరి, గౌలికార్ రాజు, హనుమంత్, రమేశ్, పోచయ్య, ప్రసాద్, యాదగిరి తదితరులున్నారు.

ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేఖర్‌గుప్తాకు ఆయన శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట నాయకులు శ్రీనివాస్, అత్తెల్లి లక్ష్మయ్య, సిద్ది భిక్షపతి, శ్రీనివాస్‌గుప్తా, ఉమేశ్, తేరాల రాజు తదితరులున్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి

● ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళన

చేర్యాల, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం చేర్యాలలో ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై స్థానిక పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ చేర్యాల డివిజన్ అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో చేర్యాలను ముక్కలు చింపిన విస్తరిలా చేసి అస్తిత్వాన్ని దెబ్బతీసిందన్నారు. అధికారంలోకి వస్తే చేర్యాలను డివిజన్‌గా మార్చుతామని జనగామ ఎన్నికల సభలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాడూరు భరత్‌కుమార్, విక్రమ్ ప్రసాద్, రంజిత్, రాజు, శివ, ప్రశాంత్, ప్రవీణ్, భరత్, రవితేజ పాల్గొన్నారు.

ప్రతీ గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు

● హెచ్ఈవో పాండురంగాచారి


వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ గురువారం మహిళా వైద్యాధికారితో గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని హెచ్ఈవో పాండురంగాచారి తెలిపారు. చింతమడక, రాఘవాపూర్, నారాయణరావుపేట, లక్ష్మీదేవిపల్లి గ్రామాల హెల్త్ సబ్ సెంటర్ల పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, సూపర్‌వైజర్ సునిత, ల్యాబ్ టెక్నీషియన్ అనురాధ, స్టాఫ్ నర్సులు నరేష్, నీరజ, ఫార్మసీస్టు మల్లికార్జున్, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.